క్లుప్తంగా

రేపటి నుంచి శరన్నవరాత్రులు



క్రోసూరు: క్రోసూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో సోమవారం నుంచి దసరా సందర్భంగా 46వ శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ శనివారం తెలిపింది. ఈనెల 22వ తేదీ అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవీ అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని, 23న గజలక్ష్మిగా, 24న అన్నపూర్ణాదేవిగా, 25న గాయత్రీదేవి, 26న ధనలక్ష్మి, 27న సంతానలక్ష్మి, 28న కాత్యాయని, 29న సరస్వతీదేవీ, 30న దుర్గాదేవి, అక్టోబర్ 1 వ తేదీ మహిషాసురమర్దిని, 2వ తేదీ రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు దర్శనమిస్తారని పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం



షేక్ ఆసిఫ్

సత్తెనపల్లి: యువకుడు కనిపించడం లేదని సత్తెనపల్లి రూరల్ పీఎస్‌లో కేసు నమోదైంది. మేడికొండూరు మండలం పేరేచర్లకు చెందిన 29 ఏళ్ల యువకుడు షేక్ ఆసిఫ్ ఈ నెల 16వ తేదీ రాత్రి సత్తెనపల్లి మండలం కంటెపూడి గ్రామానికి వెళ్లి తిరిగి రాలేదు. అతని కోసం పలుచోట్ల వెదికినా సమాచారం లభించలేదు. అతని తండ్రి షేక్ హసన్ సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేశాడు. ఆసిఫ్ ఆచూకి తెలిసిన వారు సత్తెనపల్లి రూరల్ సీఐ 94407 96231, సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ 08641-232033 నంబర్లలో తెలపాలని పోలీసులు పేర్కొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో రక్తదాన శిబిరం



రాజుపాలెం: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యాలయ సిబ్బంది, సర్పంచ్‌లు కలసి 20 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, తహసీల్దార్ సరోజ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



సత్తెనపల్లి: లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ ఆధ్వర్యాన పట్టణంలోని ఆదరణ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శనివారం అన్నసంతర్పణ చేశారు. లయన్ పెద్దింటి వెంకటేశ్వర్లు సతీమణి పెద్దింటి జయలక్ష్మి వర్ధంతి సందర్భంగా వెంకటేశ్వర్లు సౌజన్యంతో అన్నదానం జరిగింది. కార్యక్రమంలో లయన్ పొన్నెకంటి కిషోర్ కుమార్, లయన్ తోట చినసాంబశివయ్య, లయన్ కృష్ణమాచార్యులు, లయన్ కంకణాల విష్ణువర్ధన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

వేద విద్యాసంస్థల అధినేత లలితాంబ మాతాజీ మృతి



సత్తెనపల్లి: సనారి వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమ పీఠాధిపతులు, ధర్మకర్త, వేద విద్యాసంస్థల అధినేత చింతాడ లలితాంబ మాతాజీ (98) శనివారం మృతి చెందారు. కొద్ది రోజులుగా ఆమె అనారోగ్యంతో పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. లలితాంబ మాతాజీ భౌతికకాయాన్ని ప్రజలు, భక్తులు, బంధుమిత్రుల సందర్శనార్థం సనారీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమం వద్ద ఉంచారు. పలువురు పట్టణ ప్రముఖులు, భక్తులు, బంధువులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోండి

శావల్యాపురం: మహిళా సంఘాల్లో అర్హత కల్గిన సభ్యులందరికీ స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తామని వినుకొండ క్లస్టర్ స్త్రీనిధి మేనేజరు కె.రాహుల్ అన్నారు. శనివారం స్థానిక మండల వెలుగు సమాఖ్య కార్యాలయంలో వీవోఏ స్త్రీనిధి రుణాలు రికవరీ లక్ష్యాలపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సుస్థిరమైన జీవనోపాధి పెంపుదలకు స్త్రీనిధి రుణాలు దోహదపడతాయన్నారు. వినుకొండ నియోజవర్గంలో స్త్రీనిధి రుణాలు రూ.20 కోట్లు నిధులు కేటాయించగా 840 మంది రూ. 7 కోట్లు స్త్రీనిధి రుణాలను పారదర్శకంగా అందజేశామన్నారు. ఇందులో శావల్యాపురం మండలం రూ. 9 కోట్లు కేటాయించగా రూ. 2 కోట్లు 25 లక్షలు రుణాలు మంజూరు చేశామన్నారు. స్త్రీనిధి రుణాలు నగదు రహిత రూపంలో జరుగుతుందన్నారు. తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేస్తామన్నారు. డాక్యుమెంటేషన్ చేసిన 48 గంటల వ్యవధిలో రుణాన్ని వారి బ్యాంకు ఖాతాకు నేరుగా జమ చేస్తామని చెప్పారు.

శిథిలావస్థలో..



ముప్పాళ్ళలో పెచ్చులూడిన పశువైద్యశాల

- ముప్పాళ్ళ పశువైద్యశాల
- కొత్త భవనం నిర్మించాలి

ముప్పాళ్ళ: శిథిల భవనంలో పశు వైద్యం చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ముప్పాళ్ల వైద్యశాల శిథిలావస్థకు చేరుకుంది. పై కప్పు పెచ్చులు ఊడి ఎవరి మీద పడుతుందోనంటూ బిక్కుబిక్కు మంటూ సిబ్బంది విధులు నిర్వహించాల్సి వస్తోంది. ముప్పాళ్ళలోని మండల పశువైద్యశాలకు ముప్పాళ్ళ, చాగంటివారిపాలెం, తురకపాలెం, లంకెలకూరపాడు గ్రామాలతో పాటుగా మండల పరిధిలో అత్యవసరమైన పశు వైద్యసేవలకు ఇక్కడికే వస్తుంటాయి. ఈ ఆస్పత్రిని 44 ఏళ్ల క్రితం నిర్మించారు. ఇంతటి ప్రాధాన్యమున్న ఈ పశువుల ఆస్పత్రి శ్లాబు పెచ్చులూడి పోయి అధ్వానంగా కనిపిస్తుంది. చిన్నపాటి వర్షం కురిసినా పెచ్చులూడిన శ్లాబు నుంచి వర్షం నీరు కారుతుంటుంది. సిబ్బంది విధులకు ఆటంకం కలగడమే కాకుండా పశువైద్యానికి తీసుకొచ్చి భద్రపరిచిన మందులు తడిసిపోతున్నాయి.



గదిలోపల పెచ్చులూడిన శ్లాబ్

దాతల సాయంతో నిర్మించిన షెడ్డులోనే..

దాతల సాయంతో కొన్నాళ్ల క్రితం నిర్మించిన రేకుల షెడ్డులోనే వైద్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. రికార్డులతో పాటుగా విలువైన వస్తువులను అక్కడే దాచిపెట్టుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. వైద్యశాలకు వచ్చే స్టాకు పట్టకపోవడంతో కొంత ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. మండలంలో 367 ఆవులు, 6,310 గేదెలు, 4,584 గొర్రెలు, 1,091 మేకలు ఉన్నాయి. ఎంతో అవసరమున్న పశువైద్యశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

కనీసం మరమ్మతులైనా చేయించాలి



కొత్త భవనం నిర్మించాలి. లేకపోతే సేవలందించేందుకు ఉన్న భవనానికి మరమ్మతులైనా చేయాలి. మండల కేంద్రంలో ఉన్న పశువైద్యశాలకు భవనం నిర్మించాల్సిన అవసరం ఎంతో ఉంది. పశువైద్యానికి అవసరమైన ఆస్పత్రి సరిగ్గా లేకుంటే విధులు ఎలా నిర్వహిస్తారు.

–చక్కెర లక్ష్మిరెడ్డి, చాగంటివారిపాలెం

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ఆస్పత్రి శిథిలావస్థకు చేరిన విషయం జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కొత్త భవనం మంజూరు చేయాలని కోరాం. వర్షాకాలం నీరు కారుతుంది. రికార్డులు భద్రపరచడం ఇబ్బందికరంగా ఉంది.

–వి.బాలకృష్ణారెడ్డి, మండల పశువైద్యాధికారి, ముప్పాళ్ళ

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



ప్రగతి కళాశాల రోడ్డులో మొక్కలు నాటుతున్న దృశ్యం

సత్తెనపల్లి: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని మున్సిపల్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బోయపాటి మధుసూదనరావు అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛందంలో భాగంగా సెప్టెంబర్ మాసానికి ప్రకటించిన థీం గ్రీన్ ఏపీలో పట్టణ పరిధిలోని ప్రగతి జూనియర్ కళాశాల రోడ్డులో మెగా ప్లాంటేషన్ డ్రైవ్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ ఇళ్ల ముందు పరిసరాలను శుభ్రపరిచి మొక్కలు నాటాలన్నారు. పర్యావరణానికి పచ్చదనం ఎంతో అవసరమని, కాలుష్య నివారణకు మొక్కలు సహకరిస్తాయన్నారు. ఈ సందర్భంగా మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు దరువూరి నాగేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, శానిటరీ మేస్త్రిలు, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

అచ్చంపేట: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీవో కోయా శ్రీనివాసరావు తెలిపారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. సర్పంచ్ జాన్, ఉపాధి సిబ్బంది, పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

- కోగంటివారిపాలెంలో సర్పంచ్ బోనం నాగిరెడ్డి ఆధ్వర్యాన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం

పెదకూరపాడు: మండల పరిధి 75 తాళ్లూరు గ్రామంలోని కాశీ అన్నపూర్ణేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం మాస శివరాత్రి పురస్కరించుకుని మహన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు ఆదిత్య శర్మ సుదురుపాటి హనుమంతరావు శర్మ, హరినాథ్‌శర్మ గణపతి పూజ, రుద్రాభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

ఉచిత వైద్యశిబిరాలు

అచ్చంపేట: మండలంలోని కోగంటివారిపాలెం, కొత్తపల్లి గ్రామాల్లో శనివారం వైద్యశిబిరాలు నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా అక్టోబర్ 2వరకు జరుగుతాయని మండలశాఖ అధ్యక్షులు పడగండ్ల లక్ష్మాచారి తెలిపారు. వైద్య శిబిరాలలో బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల సేవా పక్వాడ్ కన్వీనర్ జలసూత్రపు గోపాలకృష్ణ, కో కన్వీనర్ బాలస్వామి, మోదిల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహానటుడు అక్కినేని



అక్కినేని చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఘంటసాల కళాసమితి సభ్యులు

క్రోసూరు: తెలుగు జాతి గర్వించదగ్గ మహానటుడు కళాప్రపూర్ణ డాక్టర్ అక్కినేని నాగేశ్వరావు అని ఘంటసాల కళా సమితి గౌరవ అధ్యక్షులు శిఖా శాంసన్ అన్నారు. శనివారం సినీ నటుడు డాక్టర్ అక్కినేని నాగేశ్వరావు జయంతి సందర్భంగా అమరావతి బస్టాండ్‌లోని ప్రయాణికుల ప్రాంగణంలో శిఖా శాంసన్, అభిమానులు పాల్గొని అక్కినేని చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శాంసన్ మాట్లాడుతూ తెలుగు చలనచిత్ర సీమలో కొత్త అధ్యాయాన్ని సృష్టించి తెలుగు ప్రేక్షక అభిమానుల మనసుల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఈ సందర్భంగా అక్కడ హాజరైన ప్రజలు, చిన్నారులకు మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో కళాసమితి కార్యదర్శి షేక్ మస్తాన్, కూనల నాగరాజు, షేక్ జానీ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం

నరసరావుపేట రూరల్: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఎస్ఆర్‌కేటీ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అమినిగడ్డ గురులింగంను శనివారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు సత్కారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి గురులింగం చేస్తున్న కృషిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్, వెంకట సుబ్బారావు, ఫాతిమారాణి, అపర్ణ, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ చూపాలి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ విద్య



బొల్లవరంలో వైద్య పరీక్షలు

పెదకూరపాడు: మహిళలు ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ చూపాలని పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి విద్య అన్నారు. స్వస్థ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా శనివారం పెద్దకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ప్రసాద్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. మొత్తం 30 మందికి పైగా రక్తదానం చేశారు. అర్తిమల్ల రమేష్, ఏటుకూరి బ్రహ్మయ్య, బెల్లంకొండ రామ్‌గోపాల్‌రావు, వడ్లమూడి అప్పారావు, భాష్యం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బొల్లవరం(ముప్పాళ్ళ): బొల్లవరం, పలుదేవర్లపాడు గ్రామాల్లో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం శనివారం జరిగింది. శిబిరంలో పీహెచ్‌సీ వైద్యులు రమాదేవి, జయకృష్ణప్రవీణ్ పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ దస్తగిరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజుపాలెం: బలిజేపల్లి గ్రామంలో స్వస్త్ నారీ సశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా పీహెచ్‌సీ ఆధ్వర్యాన శనివారం మహిళలకు వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ పాల్‌రవి 139 మంది మహిళలకు బీపీ, షుగర్ రక్త పరీక్షలు చేసి మందులను అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ఉషారాణి, ఎంఎల్‌హెచ్‌పీ అలేఖ్య పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రకు ముందుకు రావాలి



సత్తెనపల్లిలో పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: స్వచ్ఛాంధ్ర కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ పిలుపునిచ్చారు. పట్టణంలోని 16వ వార్డులో స్వచ్ఛ ఉత్సవ్ కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వం రూ. కోటి ప్రమాద బీమా కల్పిస్తుందన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు దరువూరి నాగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, 16వ వార్డు కౌన్సిలర్ కంభంపాటి అబ్రహం, ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యురాలు యెల్లినేడి లక్ష్మీ తులసి తదితరులు ఉన్నారు.

పంచాయతీల ఆదాయ వనరులపై దృష్టి

సత్తెనపల్లి డీఎల్‌డీవో రాజగోపాల్



శిక్షణ పొందిన వారితో రాజగోపాల్, అధికారులు

సత్తెనపల్లి: పంచాయతీల ఆదాయ వనరులపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి పెట్టాలని సత్తెనపల్లి డీఎల్‌డీవో రాజగోపాల్ అన్నారు. సత్తెనపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో రెండు రోజులపాటు గ్రామాల్లో సొంత ఆదాయ వనరుల రూపకల్పనపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు నిర్వహించిన అవగాహన, శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. డీఎల్‌డీవో రాజగోపాల్ మాట్లాడుతూ ఆదాయ వనరులను పెంచుకోవడంపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు అవగాహన కలిగి ఉండాలన్నారు. అధిక రాబడి ఉన్నప్పుడు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తే అభివృద్ధి పథంలో పయనించవచ్చన్నారు. సొంత ఆదాయ వనరులు పన్ను, పన్నేతర ఆదాయాన్ని ఎలా రాబట్టాలో వివరించారు. శిక్షణకు ఎంఓటీగా వి.శ్యామ్ చైతన్య, టీఓటీలుగా షేక్ ఖాదర్‌బాషా, ఎ.ఉమాశంకర్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో టి.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి డెప్యూటీ ఎంపీడీవో షేక్ అజీజుర్ రెహమాన్, జూనియర్ అసిస్టెంట్ విజయ్‌సుందరదాసు తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల, పౌరాణిక కళాకారుడు బెజగంకు సత్కారం



సత్కారం అందుకుంటున్న బెజగం రవికుమార్

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన వర్ధమాన రంగస్థల పౌరాణిక కళాకారుడు బెజగం రవికుమార్ రంగస్థల ప్రవేశం చేసి దశాబ్దం పూర్తయిన సందర్భంగా శనివారం పట్టణంలో జరిగిన అభినందన సభలో ఆయనను సత్కరించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కోటగిరి పోతులూరయ్య అధ్యక్షతన నిర్వహించిన అభినందన సభలో కళాకారుడు, న్యాయవాది పిన్నమనేని పాము లయ్య, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సత్తెనపల్లి శాఖ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి గిరీష్‌రెడ్డి తదితరులు రవికుమార్ కళా నైపుణ్యాన్ని కొనియాడారు. అనంతరం రవికుమార్‌ను పూలమాలలు, మెమెంటో, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వివిధ కళా సంస్థల బాధ్యులు దూపాటి నాగేశ్వరరావు, శ్రీనివాస్, అంజలి, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఈ-శ్రమ్ కార్డులకు నమోదు చేసుకోండి

సత్తెనపల్లి: అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక, ఆర్థిక భద్రతకు కేంద్ర ప్రభుత్వం 2021 ఆగస్టులో ఈ-శ్రమ్ పోర్టల్‌ను ప్రారంభించిందని, కార్మికులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సత్తెనపల్లి సహాయ కార్మిక శాఖ అధికారి వి.అన్నపూర్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికుల వివరాలు పోర్టల్‌లో నమోదు చేసి వారికి గుర్తింపు కార్డులు అందజేస్తారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలుగా ఉన్నప్పుడు ఈ-శ్రమ్ కార్డులు పెద్ద మొత్తంలో నమోదు చేశారని తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు, చేనేత కార్మికులు, మత్స్య కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, ఉపాధి శ్రామికులు, వీధి వ్యాపారులు,వడ్రంగులు, రవాణా కూలీలు, ఇళ్లల్లో పనిచేసే కార్మికులు, ఆశా కార్యకర్తలు, వివిధ చేతివృత్తుల వారు ఈ- శ్రమ్ కింద లబ్ధికి అర్హులన్నారు. 16 నుంచి 59 ఏళ్ల లోపు వారందరూ లబ్ధి పొందవచ్చని తెలిపారు. దీనికి ఆధార్‌కార్డు, బ్యాంక్‌ఖాతా, ఆధార్‌తో అనుసంధాన మైన సెల్‌ఫోన్ నంబరు ఉండాలని సూచించారు. హెచ్‌టీటీపీ.ఈ శ్రమ్ జీవోవీ.ఇన్ పోర్టల్ లో వివరాలు నమోదు చేసుకోవచ్చని వివరించారు. సత్తెనపల్లి సహాయ కార్మిక శాఖ కార్యాలయంలో, మీసేవ, సీఎస్‌సీ కేంద్రాలు, సచివాలయాల్లో కూడా నమోదుకు అవకాశం కల్పించారని తెలిపారు. సందేహాలు ఏమైనా ఉంటే సత్తెనపల్లి సహాయ కార్మిక శాఖ కార్యాలయంలో, 94925 55155లో సంప్రదించాలని సూచించారు.

బాలామృతం చిన్నారులకు మంచిది

88త్యాళ్లూరు(క్రోసూరు):మండలంలోని 88త్యాళ్లూరు సెక్టార్ పరిధిలో శనివారం పోషణ్ మహా కార్యక్రమం సీడీపీవో వెంకటరమణ అధ్యక్షతన జరిగింది. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషకారంపై శ్రద్ధ వహించాలన్నారు. ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు విరివిగా తీసుకోవాలన్నారు. బాలమృతం చిన్నారులకు ఎంతో మంచిదన్నారు. తల్లులకు వంటలపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ మైమున్నీసా, అంగన్‌వాడీ వర్కర్లు ప్రభావతి, మల్లీశ్వరి, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట: కోగంటివారిపాలెంలో 8వ రాష్ట్రీయ మాసోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యాన గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కార్యకర్తలు ఆహార నియమాలను వైద్య సిబ్బంది వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్.మాణిక్యం, సిబ్బంది పాల్గొన్నారు.

సేవలే లక్ష్యం



ఇన్సూరెన్స్ చెక్కులు పంపిణీ చేస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

అచ్చంపేట: అవసరమైన వారికి సేవలు అందించడమే లక్ష్యమని వాసవీ క్లబ్ సభ్యులు తెలిపారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యాన మండలంలో పలు ప్రాంతాల్లో క్లబ్ సభ్యులు శనివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక హరిహర క్షేత్రంలో నిరుపేదలకు బియ్యం పంపిణీ చేశారు. గోల్డెన్ బర్డ్ స్కూలు విద్యార్థులకు బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. వాసవీ కుటుంబ సురక్ష పథకం కిం ఇన్సూరెన్స్ చెక్కులు పంపిణీ చేశారు. స్థానిక గోశాలకు గోవులకు తవుడు సరఫరా చేశారు. జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులకు మెడిటేషన్‌పై అవగాహన కల్పించారు. నీలేశ్వరపాలెంలోని నీలకంఠేశ్వరస్వామి వారి దేవస్థానం, స్థానిక భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ జిల్లా, మండల ప్రముఖులు చిరంజీవి, పోతుగంటి రమేష్, వెల్లంపల్లి కేశవరావు, సూరే వెంకట కోటిలింగం, అనుమెల శేషగిరిరావు, గ్రంధి రాము, కొత్త మాసు శంకర్, బి.రవికుమార్, వీరవల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

• కానరాని చెత్తశుద్ధి



సత్తెనపల్లి వడ్డవల్లి రామాలయ సమీపంలో మార్కెట్ వ్యర్థాలు



రోడ్డుపై వర్షం నీరు

స్వచ్ఛ ఉత్సవ్ అంటూ ప్రకటనలే గానీ ఆచరణలో చిత్తశుద్ధి కనపడటం లేదు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అంతా మొక్కుబడేతప్ప స్వచ్ఛత మచ్చుకైనా కానరావడం లేదు. సత్తెనపల్లి వడ్డవల్లి రామాలయం వద్ద కూరగాయల మార్కెట్‌లోని వ్యర్థాలు పేరుకుపోవడంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. పట్టణంలోని ది బాగ్స్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చి వెనుక భాగంలో వర్షం నీరు పోయే దారి లేక రోడ్డుపై చేరి వాహనచోదకులు, పాదచారులకు ఇబ్బంది కలిగిస్తోంది. ఓ వైపు స్వచ్ఛ ఉత్సవ్ నిర్వహిస్తుంటే మరోవైపు స్వచ్ఛత లేక ప్రజలు అవస్థ పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చిత్తశుద్ధితో పని చేయించాల్సి ఉంది.

–సత్తెనపల్లి

వ్యాధిగ్రస్తులపై వివక్ష వద్దు



బెల్లంకొండలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, చైల్డ్‌ఫండ్ ఇండియా సభ్యులు

బెల్లంకొండ: వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపొద్దని బెల్లంకొండ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం శాంతి కోరారు. మండల కేంద్రంలో శనివారం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సూచనల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో హెచ్ఐవీ అవగాహనకు జెడ్పీ పాఠశాల విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సంస్థ జోనల్ సూపర్‌వైజర్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో 100 గ్రామాల్లో సంస్థ ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. 8 వారాలపాటు హెచ్ఐవీ, టీబీ, సుఖ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ రక్త పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ లింక్ వర్కర్లు దీనకుమారి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.